ప్రజాస్వామ్యం.. ఏక, ఉభయ చట్ట సభలు

ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసన శాఖ ప్రభుత్వానికి గుండె వంటిది. కార్యనిర్వాహక శాఖ, న్యాయ శాఖలు అంతే ప్రాధాన్యం కలిగి ఉన్నప్పటికీ... ప్రజలకు ప్రత్యక్షంగా ప్రాతినిధ్యం వహించే శాసన శాఖ సహజంగానే మిగతా రెండు శాఖలను ప్రభావితం చేస్తూ... తన ఆధిపత్యాన్ని నిలుపుకొంది. ఆధునిక కాలంలో ప్రజల్లో రాజకీయ చైతన్యం పెరగడం.. దాన్ని ప్రతిబింబించే శాసన శాఖ(పార్లమెంటు) ప్రభుత్వాన్ని నియంత్రించే స్థితికి ఎదగడం జరిగింది.

20వ శతాబ్దం మధ్యకాలానికి ప్రజాస్వామ్య ప్రభుత్వం ఒక భావనా సూత్రీకరణ (Paradigm)గా మారింది. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కొన్ని పార్లమెంటరీ తరహా, మరికొన్ని అధ్యక్ష తరహా, ఇంకా కొన్ని ఈ రెండింటి లక్షణాలను మేళవించి మధ్యస్థ తరహాలో పనిచేస్తున్నాయి. ఎక్కువ శాతం ప్రజాస్వామ్య దేశాలు పార్లమెంటరీ తరహా విధానాన్ని అనుసరిస్తున్నాయి. బ్రిటన్, ఇండియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ ఇందుకు ఉదాహరణలు. అమెరికా, ఫిలిప్పీన్స్, రష్యా, దక్షిణాఫ్రికా మొదలైన దేశాల్లో అధ్యక్ష తరహా కొనసాగుతోంది. ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ లాంటి దేశాల్లో పై రెండింటికి భిన్నమైన ప్రజాస్వామ్య ప్రభుత్వా లున్నాయి. ప్రపంచంలో ఎక్కువ దేశాల్లో ఉభయసభల (ద్వంద్వ-Bicameralism) పద్ధతి కొనసాగుతోంది. బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, అమెరికా, ఇండియా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, శ్రీలంక ఇందుకు ఉదాహరణలు. గ్రీస్, పోర్చుగల్, ఫిన్లాండ్, బల్గేరియా, ఇజ్రాయెల్ వంటి దేశాల్లో ఏక శాసనసభ పద్ధతి అమలవుతుంది. జె.ఎస్.మిల్, హెన్రిమెయిన్, లార్డ్ ఆక్టన్ లాంటి రాజనీతి శాస్త్ర పండితులు ఉభయ శాసనసభా విధానాన్ని సమర్థిస్తే... థామస్ పెయిన్, బెంజమిన్ ఫ్రాంక్లిన్, ఆబిసయ్యద్ వంటి మేధావులు ఏకశాసనసభా విధానాన్ని సమర్థించారు. ఆయా దేశాలు చారిత్రక, సాంస్కృతిక, ఆర్థిక, దేశ పరిమాణం, జనాభా మొదలైన అంశాలను దృష్టిలో పెట్టుకొని ఏక, లేదా ఉభయ శాసనసభ విధానం వైపు మొగ్గు చూపుతాయి. ఈ రెండు విధానాలకు అనుకూల, ప్రతికూల వాదనలున్నాయి.

ఉభయ శాసనసభా పద్ధతి... ప్రయోజనాలు:

1. ఉభయ శాసనసభా విధానంలో శాసనశాఖ నియంతృత్వ ధోరణితో వ్యవహరించడానికి వీలుండదు. ఏదైనా ఒక సభ దుడుకుగా, బాధ్యతారహితంగా ప్రవర్తించడానికి ప్రయత్నిస్తే.. రెండో సభ దాన్ని అడ్డుకుంటుంది. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించడానికి ఒకదాన్ని ఇంకొకటి పరిమితం చేస్తూ... సమతౌల్యత సాధించడానికి వీలవుతుంది.
2. ఆధునిక కాలంలో శాసన రూపకల్పన క్లిష్టతరమవుతోంది. కాలయాపనతో కూడుకుంది కూడా. ఉభయ శాసనసభలు ఉన్నట్లయితే... వాటి మధ్య పని విభజన జరుగుతుంది. తద్వారా



వేగంగా, నాణ్యమైన చట్టాలను రూపొందించడానికి వీలవుతుంది.
3. సమాఖ్య వ్యవస్థ ఉన్న అమెరికా, ఇండియా లాంటి దేశాల్లో జాతీయ స్థాయిలో ప్రాంతీయ ప్రభుత్వాలకు ప్రాతినిధ్యమి వ్వడానికి ఎగువసభలైన సెనెట్, రాజ్యసభల్ని ఏర్పాటు చేశారు. భారతదేశంలో రెండో పాలనా సంస్కరణల సంఘం రాష్ట్ర స్థాయిలో స్థానిక ప్రభుత్వాలకు ప్రాతినిధ్యం కల్పించడానికి అన్ని రాష్ట్ర శాసనసభలు ఎగువసభ (విధాన పరిషత్)ను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది.
4. సాధారణంగా దిగువ సభ సభ్యులు ప్రాదేశిక నియోజకవర్గ ప్రాతిపదికగా ప్రజలతో ప్రత్యక్షంగా ఎన్నికవుతారు. మేధావులకు, నిపుణులకు, అల్పసంఖ్యాక వర్గాలకు ప్రాతినిధ్య మివ్వాలంటే (పరోక్షంగా, లేదా నామినేషన్ పద్ధతి ద్వారా) ఎగువ సభ అవసరం.
5. వివాదాస్పద అంశాలపై శాసనసభ ప్రతిపాదనలు (బిల్లులు) రూపొందించేటప్పుడు నిర్దుష్ట ప్రజాభిప్రాయమేర్పరచడానికి కొంత సమయం కావాలి. ఉభయ సభలున్నప్పుడు, ఆ రెండు ఒక దాని తర్వాత ఇంకొకటి ఆ బిల్లులను చర్చి స్తాయి. ఏకశాసన సభా విధానంలో అలా జాప్యం చేయడం ద్వారా ప్రజాభిప్రాయాన్ని రూపొందించడానికి వీలుండదు.
6. ఎగువసభలు సాధారణంగా శాశ్వత ప్రాతిపదికన నిర్మితమవుతాయి. అందులో సభ్యులు వంతుల వారీగా ఎంపికవడం, పదవీ విరమణ చేయడం జరుగుతుంది. ఉదాహరణకు మన రాజ్యసభ, విధాన పరిషత్ సభ్యుల్లో ప్రతి రెండు సంవత్సరాలకొకసారి మూడోవంతు సభ్యులు పదవీ విరమణ చేస్తే.. ఆ ఖాళీలు పూరించడానికి ఎన్నికలు జరుగుతాయి. ఈ పద్ధతి వల్ల మారుతున్న ప్రజాభిప్రాయం ప్రతిబింబిస్తుంది. శాశ్వత ప్రాతిపదికన రూపొందింది కనుకనే 'నిరంతరత' (కంటిన్యూటి) లభిస్తుంది.
7. దిగువ సభ ఎక్కువ శాతం క్రియాశీలత కలిగిన రాజకీయ నాయకులతో కూడి ఉంటుంది. అనేక సందర్భాల్లో వీరు అతివాద (రాడికల్) భావాలను వ్యక్తంచేస్తారు. దీనికి విరుగుడుగా ఎగువసభకు ఎన్నికయ్యే మితవాద భావాలు కలిగిన ప్రతినిధులు పనిచేస్తారు. అతివాద, మితవాద భావాల మధ్య సమతౌల్యత అవసరం. ఉభయసభల విధానం ఈ అవకాశం కల్పిస్తుంది.

ఏక శాసనసభా పద్ధతి... ప్రయోజనాలు:

1. ఏక శాసన సభ ఏర్పాటు సులభం. ఒకే సభ వల్ల ఖర్చు తగ్గుతుంది. వర్ధమాన దేశాలు ఉభయసభల నిర్వహణకయ్యే ఖర్చు భరించలేవు. మన దేశంలో పార్లమెంటు నిర్వహణకు ప్రతి నిమిషానికి రూ. 35 వేల ఖర్చవుతుంది.
2. అనవసర ఘర్షణ నివారించవచ్చు. జాప్యాన్ని తగ్గించవచ్చు.
3. మేధావుల, ప్రభావ వర్గాల, అల్పసంఖ్యాక వర్గాల ప్రాతినిధ్యానికి ఒక ప్రత్యేక సభ ఉండాలనే నిబంధన ఏమిలేదు. ఏక శాసనసభలోనే కొన్ని స్థానాలు పైన పేర్కొన్న వర్గాలకు కేటాయించవచ్చు. మన లోక్‌సభ, విధాన సభల్లో ఆంగ్లో ఇండియన్‌లకు నామినేషన్ ద్వారా ప్రాతినిధ్యం లభిస్తోంది.
4. సమాఖ్య వ్యవస్థలో ప్రాంతీయ, స్థానిక ప్రభుత్వాలకు ప్రాతినిధ్యమివ్వడానికి ఎగువసభ అవసరమనే వాదనలో బలం లేదు. ఆయా శాసనసభలు పనిచేస్తున్న తీరును గమనిస్తే.. ఎగువసభలు రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల ప్రయోజనాల పరిరక్షణ కంటే, పార్టీ ప్రయోజనాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి. రాజ్యసభ సభ్యులు వివిధ రాష్ట్రాలకు ప్రాతిని ధ్యమిస్తున్నారనే దాని కంటే వివిధ రాజకీయ పక్షాలకు(ఆ రాష్ట్రంలోని రాజకీయ పక్షాల బలాబలాలను బట్టి) కొమ్ము కాస్తున్నారని చెప్పవచ్చు. లోక్‌సభ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ఏ మాత్రం తీసిపోదు.
5. ఆబిసయ్యద్ వ్యాఖ్యానించినట్లు''ఎగువసభ, దిగువసభను వ్యతిరేకించడం అపచారం; ఎగువసభ దిగువసభతో ఏకీభవిస్తే, అది అనవసరం.''

ఆధునికకాలంలో శాసన సభలు నిర్వర్తిస్తున్న విధులు:

1. శాసన సభగా దీని ప్రధాన కర్తవ్యం చట్ట రూపకల్పన. ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించేదే చట్టం. పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థలో కార్యనిర్వాహక వర్గం రూపొందించిన విధానాలకు చట్టబద్ధత కలిగించేది శాసన వ్యవస్థ ఆమోదించిన బిల్లులు.
2. ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించి, వాటి పరిష్కారానికి సంబంధిత మంత్రుల నుంచి తగిన హామీలను పొందుతుంది. ప్రశ్నోత్తరాల సమయం, సావధాన తీర్మానం, వాయిదా తీర్మానం, అర్ధగంట చర్చ మొదలైనవి ఈ కోవకు చెందినవే. తద్వారా కార్య నిర్వాహక వర్గాన్ని నియంత్రించడానికి, జవాబుదారీతనానికి వీలవుతుంది.
3. పార్లమెంటరీ తరహా ప్రభుత్వంలో మంత్రిమండలిని నియంత్రించడం, శ్రుతిమించినపుడు అభిశంసన (సెన్సూర్), అవిశ్వాస తీర్మానం ద్వారా తన అసంతృప్తిని తెలియచేస్తుంది. అవిశ్వాస తీర్మానం ఆమోదం.. మంత్రిమండలి రాజీనామాకు దారితీస్తుంది.
4. బడ్జెట్‌ను ఆమోదించడం ద్వారా, శాసన సభ విత్త విషయాల్లో కార్యనిర్వాహక వర్గాన్ని నియంత్రిస్తుంది. శాసన శాఖ అనుమతి లేకుండా పన్నులు వసూలు చేయడానికి, ఖర్చు పెట్టడానికి వీలులేదు. బడ్జెట్‌ను ఆమోదించే ప్రక్రియలో వివిధ కోత (నామ మాత్రపు, పొదుపు, విధానపరమైన) తీర్మానాలను ప్రతిపాదించడం ద్వారా.. మంత్రిమండలిని నియంత్రిస్తుంది. కోత తీర్మానం ఆమోదం పొందితే మంత్రి మండలి రాజీనామా చేయాలి.
5. రాజ్యాంగాన్ని సవరించే అధికారం శాసన వ్యవస్థకు ఉంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగంలో మార్పు చేసే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంది.
6. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు.. ఇతర రాజ్యాంగ వ్యవస్థల అధికారులను తొలగించే అధికారం పార్లమెంటుకు ఉంది. ఇది అర్ధన్యాయ సంబంధ విధి.
7. ప్రభుత్వ కార్యకలాపాల్లో భారీఎత్తున అవకతవకలు జరిగినప్పుడు వాటిపై విచారణ జరిపి తగిన చర్యలను సిఫార్సు చేసే అధికారం పార్లమెంటుకు ఉంది. బోఫోర్సు శతఘ్నుల కొనుగోలులో జరిగిన అవకతవకలను విచారించడానికి మన పార్లమెంటు సంయుక్త పార్లమెంటరీ కమిటీని నియ మించింది.
8. రాజ్యాంగపరమైన వ్యవస్థలు (కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్, ఎన్నికల కమిషన్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మొదలైనవి) సమర్పించిన వార్షిక నివేదికలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోడానికి సిఫార్సులు చేస్తుంది.
9. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్,వివిధ కమిటీల సభ్యులను పార్లమెంటు ఎన్ను కుంటుంది.

దురదృష్టవశాత్తు శాసనసభ పనితీరు ఆశాజనకంగా లేదు. రోజు రోజుకు ప్రాధాన్యతను సంతరించుకుంటున్న కార్యనిర్వాహక వర్గం, న్యాయశాఖ.. శాసనశాఖ క్షీణతకు దోహదం చేస్తుంటే... నేర చరిత్ర కల్గిన వారు శాసనసభల్లో ప్రవేశించడం, శాసన కార్యకలాపాలపై అవగాహనలేనివారు చట్టసభలకు ఎన్నిక కావడం, శాసన సభల సమావేశకాలం క్రమేణా తగ్గడం తదితర అంశాలు వాటిని మరింత బలహీనపరుస్తున్నాయి. సగటు పౌరుడిలో శాసనసభ పట్ల విశ్వాసం సన్నగిల్లుతోంది. కేవలం ధనార్జ నకు, అధికారాన్ని చెలాయించడానికి ఇవి సాధనాలుగా ఉపయోగపడుతున్నాయనే భావన ప్రజల్లో ఏర్పడింది. ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా శాసనశాఖ పనితీరును ప్రత్యక్షంగా అంచనా వేయడానికి పౌరులకు వీలవుతుంది!!

ముఖ్యాంశాలు

- అధిక శాతం దేశాల్లో ఉభయ సభల పద్ధతే కొనసాగుతోంది.
- రాష్ట్రాల్లో ఎగువ సభలను ఏర్పాటు చేయాలని సూచించింది రెండో పాలనా సంస్కరణల సంఘం.
- ఎగువ సభలు శాశ్వత ప్రాతిపదికన నిర్మితమవుతాయి. అందులో సభ్యులు వంతుల వారీగా ఎంపికవడం, పదవీ విరమణ చేయడం జరుగుతుంది.
- మన దేశంలో పార్లమెంటు నిర్వహణకు ప్రతి నిమిషానికి రూ. 35 వేల ఖర్చవుతుంది.

- మన లోక్‌సభ, విధాన సభల్లో ఆంగ్లో ఇండియన్‌లకు నామినేషన్ ద్వారా ప్రాతినిధ్యం లభిస్తుంది.
- పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థలో కార్యనిర్వాహక వర్గం రూపొందించిన విధానాలకు శాసనసభలు ఆమోదించిన బిల్లులు చట్టబద్ధత కల్పిస్తాయి.
- రాజ్యాంగాన్ని సవరించే అధికారం శాసన వ్యవస్థకు ఉంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగంలో మార్పు చేసే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంది.
- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్, వివిధ కమిటీల సభ్యులను పార్లమెంటు ఎన్నుకుంటుంది.